కథ

# ఏవీ ఆనాటి మతాబులు?

ప్రభాకర్



''జగ్గయ్యపేట''.

ఆ ఊరి పేరు వింటేనే నా మనస్సు, శరీరం ఉద్రూతలూగిపోయేది, నేను పదో తరగతికి వొచ్చే వరకు.

ఇప్పుడు 'జగ్గయ్యపేట'ను గుర్తు చేసుకున్నా ఆనాటి మధుర స్మృతులతో నా ఒళ్ళు పులకరిస్తుంది. ఆ జ్ఞాపకాలతో నా మనసు తడిసి ముద్దవుతుంది. నా బాల్యమంతా వరంగల్లోనే గడిచింది. చదువు కూడా వరంగల్లోనే. అయితే సంవత్సరానికి రెండుసార్లు - వేసవి సెలవుల్లో, దసరా సెలవుల్లో - నా మకాం జగ్గయ్యపేటలోనే. అప్పుడప్పుడు జనగామలో, లేదా వయా జనగాం జగ్గయ్యపేటలో. దాదాపు పదిహేనేళ్ళొచ్చే వరకు ఏ దసరా  పండుగకుగానీ దీపావళికి గానీ జగ్గయ్యపేటలో లేని సంవత్సరం లేదు.

అసలు వేసవి సెలవులైపోయి జగ్గయ్యపేట వొదిలి రావాలంటే నాకు ప్రాణం మీది కొచ్చేది. వరంగల్‌కు బయల్దేరే రోజు దగ్గర పడు తుందంటేనే నాకు గుండె గొంతుకలోకి జారి కొట్టు కునేది. మళ్ళీ జీవితంలో జగ్గయ్యపేటకు రాలేనే మోనన్నంతగా దిగులేసేది. ఏదో ఒక వంక పెట్టు కుని మరో రోజుకి, యింకో రోజుకి ప్రయాణాన్ని వాయిదా వేసేందుకు ప్రయత్నించేవాణ్ణి. వరంగ ల్‌కు చేరి స్కూలుకి వెళ్ళిన నాటి నుంచే మళ్ళీ దసరా సెలవులు ఎప్పుడిస్తారా ఎప్పుడు జగ్గయ్య పేటలో వాలిపోదామా అన్న ఆరాటంతో ఈసురో మంటూ కాలం గడిపేవాణ్ణి.

మా అమ్మకో నాన్నకో వీలు కానప్పుడు; అంత చిన్న వయస్సులోనే అంటే పది పన్నెండేళ్ళకే నేను ఒంటరిగానే జగ్గయ్యపేటకు వెళ్లేవాణ్ణి. అప్పట్లో జగ్గయ్యపేటకు వరంగల్ నుంచి డైరెక్ట్ బస్సులు ఉండేవి కావు. బోనకల్లు వరకు రైల్లో వెళ్ళి అక్కడ కొంచెం దూరం వాగులో నడిచినతర్వాత అటు ప్రక్కనున్న బస్సెక్కి జగ్గయ్యపేటకు వెళ్ళాల్సి వొచ్చేది. లేదా జనగాంకు వెళ్ళి అక్కణ్ణుంచి సూర్యాపేటకు, సూర్యాపేట నుంచి జగ్గయ్యపే టకు చేరుకోవాలి.

అయినా నేనా కష్టాలన్నీ అవలీలగా అధిగ మించి ఒంటరిగానే జగ్గయ్యపేటకు వెళ్ళేవాణ్ణి.

అంతగా నన్ను ఆకర్షించేది జగ్గయ్యపేట.

ఇప్పుడాలోచిస్తే సిల్లీగా అన్పిస్తుంది. 'జగ్గ య్యపేట' పెద్ద చారిత్రాత్మకమైన ప్రదేశమూ కాదు, వరంగల్ కన్న పెద్ద సిటీ కాదు. అక్కడ నాకు ప్రాణమిత్రులూ లేరు.

కానీ 'జగ్గయ్యపేట' నా పసి మనసును అంతగా ఆకర్షించడానికి గల కారణాలను అన్వే షించే అవసరం ఆనాడు రాలేదు.

పోనీ యిప్పుడు ఆ కారణాలను విశ్లేషిద్దా మంటే, మకిలి పట్టిన ఈనాటి నా మనస్సుకు కమ్ముకున్న మాయపొరలను అతి కష్టం మీద తొల గించి, తొలగించి పరికించి చూస్తే పది పన్నెండేళ్ళ వయసున్న ''నేను'' దొరికాను. సరి వాడితో కలిసి ''జగ్గయ్యపేట'' ప్రస్థానం పరీక్షిద్దాం రండి.

★★★

ఏడో తరగతి.

మూణ్ణెల్ల పరీక్షలైపోయాయో లేదో ''చెల్లెలిని, పిల్లలను దసరా సెలవులకు జగ్గయ్యపేట పంప'' మని మా పెద్ద మావయ్య దగ్గిరి నుంచి ఉత్తరం రానే వొచ్చింది.

ఏ సెలవులైనా పిల్లలకిష్టమే అయినా, మూణ్ణెల్ల పరీక్షల తర్వాత వొచ్చే సెలవులంటే నాకు చాలా యిష్టం. ఈ సెలవులు దసరా పండుగకు ముందు మొదలై దీపావళి పండుగ వరకు ఉండేవి. దాదాపు ఈ నెలరోజులు జగ్గయ్యపేటలో నాకు ముప్ఫై క్షణాల్లా గడిచిపోయేవి.

వరంగల్ మున్సిపాలిటీలో మా నాన్న గుమా స్తాగా పనిచేసేవాడు. మేం నలుగురు పిల్లలం. మాకు ఆస్తిపాస్తులేమీ లేవు. కిరాయి యింట్లో ఉండేవాళ్ళం. ప్రతీ రెండు మూడేళ్ళకు యిల్లు మారే వాళ్ళం. అందుకే మాకు పెద్దగా చిన్ననాటి స్నేహాలు ఏర్పడలేదు. యిల్లు మారినప్పుడల్లా ఆ కొత్త వాతావరణానికి, పరిస్థితులకు అడ్జెస్ట్ కాలేక చాలా యిబ్బంది పడే వాళ్ళం.

దానికి తోడు, మా నాన్న చండశాసనుడు. ఆయన కోపంలో ఉంటే దూర్వాస మహాముని ఎందుకూ పనికి రాడు.

నలుగురి పిల్లల్లో పెద్దవాణ్ణయిన నేనంటే మా నాన్నకు మరీ కోపం. ప్రతీ దానికి తంతుండేవాడు. అయినా నేనూ ఏం తక్కువ తినలేదు. ప్రతీ రోజూ ఆ వాడలోని పోరగాళ్ళతో గొడవలే. వాళ్ళెవరైనా యింటి మీది కొచ్చి పంచాయితీ పెడితే, వాళ్ళ ముందే నాన్నతో నాకు తన్నులు తప్పేవి కాదు.

ఇంట్లో మా నాన్న ముక్కోపి అవతారం ఎత్తినా, బయట మాత్రం మంచి పేరు ప్రతిష్ట లుండేవి. మున్సిపాలిటీలో ఏ పని కావలిసినా మా నాన్న దగ్గరికొచ్చే వారు. ఫలానా వారి అబ్బాయని ఎవరైనా చెబ్తుంటే నేను కూడా గర్వంగా ఫీలయ్యే వాణ్ణి.

కానీ, ఏం లాభం... ఆయన్ను చూస్తేనే నాకు ఒకటికి పడేది.

అందుకే, పెద్ద మామయ్య దగ్గిరి నుంచి ఉత్తరం వొచ్చినా, ధైర్యం చేసి జగ్గయ్యపేటకు వెళ్తా నని అడగలేక పోయే వాణ్ణి. అమ్మ ఆయన మూడ్ చూసి ఆ ప్రస్తావన తెస్తే ఎప్పుడో ఆయనకు దయ కలిగి ఒప్పుకుంటేనే మా లేదా నా ప్రయాణం. అంత వరకు ఖామోష్. నాన్న ఆఫీసుకు వెళ్ళగానే యింక యిల్లు కిష్కింధ కాండే మా నలుగురి అల్ల రితో. అమ్మను మస్తు సతాయించాం జగ్గయ్యపే టకు పంపమని. నాతో పాటు మా చెల్లి, తమ్ముళ్ళు అరిచారు కానీ వారికి పెద్దగా జగ్గయ్యపేట రావా లని ఉండేది కాదు. వాళ్ళకు అమ్మ ఎక్కడుంటే అదే జగ్గయ్యపేట. నాకు మాత్రం జగ్గయ్యపేట వెళ్ళడం కావాలి, అక్కడ అమ్మ ఉండాలి. దాంతో పాటు నాన్న వరంగల్లోనే ఉండాలి. అప్పుడు నాకు స్వర్గంలో ఉన్నట్టు ఉండేది.

జగ్గయ్యపేట, వరంగల్ అంత సిటీ కాదు. కానీ, జగ్గయ్యపేటలో చాలా ప్రదేశాలు - గాంధీ చౌక్‌లో ఉన్న పెద్ద మావయ్య యిల్లు; మావయ్య వాళ్ళ బంగారం కొట్టు; మావయ్య యింటి ఎదు రుగా ఉన్న వినాయకుడి గుడి; గుడి అంతటా చల్లటి నీడను పరిచే వేపచెట్టు - నాకు చాలా యిష్టం.

వీటన్నింటి కంటే మా బంగారం కొట్టు పక్క నున్న శరభయ్య హోటలు - యింకా యిష్టం.

మా పెద్ద మామయ్యంటే నాకు ప్రాణం. నేనన్నా మా పెద్దమామయ్యకు చాలా యిష్టం. సెలవులకి నేను జగ్గయ్యపేటకు వెళ్ళకపోతే దిగులు పడేవాడు. ఉత్తరాల మీద ఉత్తరాలు రాస్తుండేవాడు. మా నాన్న లాగా కోపంగా కాకుండా మా పెద్ద మామయ్య ఎప్పుడూ నవ్వుతూ ఉండేవాడు. ఆయన మాట్లాడుతుంటే ముఖం అంతా సంతోషంతో విచ్చుకునేది. నాన్నకు ఎంత దూరంగా ఉండేవాణ్ణో పెద్ద మామయ్యతో అంత సన్నిహితంగా ఉండేవాణ్ణి. నాన్నతో ఎలా ఉండాలని కోరుకునేవాణ్ణో పెద్ద మామయ్యతో అలా ఉండేవాణ్ణి. పెద్ద మామయ్య ఒళ్ళో పడుకునే వాణ్ణి. ఆయన భుజాలమీదికెక్కి జుట్టు పీకేవాణ్ణి. ప్రతీ చిన్న విషయానికి మామయ్య మీద అలిగే వాణ్ణి. జబర్దస్తీగా ముద్దూ మురిపాలు జరిపించు కునే వాణ్ణి.

మా మామయ్య వాళ్ళకు పిల్లలు లేకపోతే చుట్టాలమ్మాయిని దత్తత తీసుకున్నారు. ఆ అమ్మా యిని అతి సున్నితంగా, చాలా గారాబంగా పెంచే వారు.

మామయ్య వాళ్ళది జగ్గయ్యపేటలో బంగారం కొట్టు. మామయ్య నిజాయితీ, నెమ్మది తనం మూలంగా ఆ ఊళ్ళో చాలా మంచి పేరుండేది.

మా అమ్మమ్మ వాళ్ళ ఊరు జనగామ. మా అమ్మ, పెద్ద మామయ్య కాకుండా మా అమ్మ తమ్ముడు హరి మామయ్య కూడా ఉన్నాడు. పెద్ద మామయ్య చిన్నప్పుడే జగ్గయ్యపేటకు ఇల్లరికం వెళ్ళాడు.

పెద్ద మామయ్యతో పాటు వాళ్ళింట్లో పెద్ద త్తమ్మ, ఆమె తల్లి, పెంపుడు కూతురు ఉండేవారు. బాగా డబ్బున్న వాళ్ళు కావడంతో యింటి నిండా నౌకర్లు, చాకర్లు ఉండేవారు.

వరంగల్లో యింట్లో పనులన్నీ మా అమ్మే చేసు కునేది. పొద్దున్నే వీధి పంపు దగ్గర నీళ్ళు పట్టుకు రావడం, అంట్లుతోమడం, యిల్లు ఊడ్వడం, బట్ట లుతకడం, వంట చేయడం, పిల్లలందరినీ తయా రుచేసి స్కూలుకి పంపడం వంటి పనులన్నీ అమ్మే చేసుకునేది.

నాకైతే వరంగల్‌లో అయితే నాన్న భయం. బయట తిరగాలన్నా యిష్టమైన ఆటలాడుకోవా లన్నా నాన్నకు తెలుస్తుందనే భయం. చీకటి పడ గానే గుడ్డి దీపాల వెలుతురులో చదువుకోవా లన్నా; యిరుకు గదుల్లో ఉక్కపోతలో చెమటలు కక్కుతూ పడుకోవాలన్నా నాకు చాలా చిరాకుగా ఉండేది.

వరంగల్‌లో మా జీవితానికి, జగ్గయ్యపేటలో వాళ్ళ జీవితానికి అస్సలు పోలిక లేదు.

మాతో పోలిస్తే వాళ్ళు రాజ భోగాలనుభవిస్తు న్నట్టుగా అన్పించేది నాకు.

వరంగల్లో పొద్దున్నే మా అమ్మ వొండిన అన్నం, కూర, చారు, మజ్జిగతో భోంచేసి స్కూల్‌కు వెళ్ళి, మధ్యాహ్నం యింటికొచ్చి అదే భోజనం చేసి రాత్రి కూడా అదే భోజనం చేసే వాళ్ళము.

పాలు తాగడమనేది, పళ్ళు తినడమనేది జ్వరం వొచ్చినప్పుడు మాత్రమే. చాక్‌లెట్లు, బిస్కెట్లు ఎవరైనా యిస్తేనే. కేకులు, కూల్ డ్రింకులు అంటే అసలు మాకు తెలియనే తెలి యదు.

మిల్లు ముతక గుడ్డలే మా నాన్న తెచ్చే పండుగ బట్టలు. జగ్గయ్యపేటలో అయితే మా అత్తమ్మ, పెద్ద మామయ్య పాలు తాగి పొద్దున్నే చెన్నకేశవస్వామి గుడికి వెళ్ళేవారు. వాళ్ళొచ్చేసరికి వంటమనిషి గానీ మా అత్తమ్మ తల్లి గానీ నురగలు కక్కుతున్న చిక్కటి ఫిల్టర్ కాఫీ తయారుగా ఉంచేవారు.

కాఫీ తాగుతూ మా మామయ్య పేపర్ చదివే లోపల, కొట్టు గుమాస్తా వొచ్చేవాడు. వాడు రాగానే యిక టిఫిన్ల ప్రహసనం మొదలయ్యేది. శరభయ్య హోటలు ఉన్న యిల్లు మా అత్తమ్మ పేరు మీద ఉంది. దానికి గాను నెలసరి అద్దె బదులు రోజూ అక్కడి నుండి టిఫిన్లు వొచ్చేవి. రోజూ రెండు మూడు రకాల టిఫిన్లు – ఇడ్లీ, వడ, దోసె, చట్నీ, సాంబారు. ఒక రోజైతే, ఇడ్లీ, ఊతప్ప, పెరుగు చట్నీ మరో రోజు, రవ్వదోసె పొంగల్, అల్లం చట్నీ- యిలా వొచ్చేవి. అప్పుడప్పుడు పెర్ముటేషన్స్, కాంబినేషన్స్ మారుతుండేవి.

టిఫిన్లు అయి మామయ్య కొట్టుకెళ్ళాక, వంట మనిషి రాగానే ఆ నాటి మధ్యాహ్న భోజనానికి తయారీ ప్రారంభమయ్యేది. సాయంత్రం నాలు గైదు గంటల మధ్య మళ్ళీ టిఫిన్, కాఫీ.

రాత్రికి కొందరికి చపాతీలు కొందరికి భోజనానికి వంట ప్రారంభమయ్యేది. రోజంతా ఓ పండగలా; ప్రతీ దినమూ ఓ షడ్రసోపేత విందు కార్యక్రమంలా జరిగిపోయేది.

చిన్నపిల్లవాణ్ణి కావడంతోనూ, అట్లాంటి రుచులు ఎప్పుడూ ఆస్వాదించేవాణ్ణి కాకపోవడంతోనూ నాకైతే అక్కడ చాలా, భలే సంబరంగా ఉండేది. జగ్గయ్యపేటలో నా స్వాతంత్ర్యానికి అడ్డూ, అదుపులేదు. ఆ స్వేచ్ఛా ప్రపంచానికి నేనే అధిపతిని. మామయ్య అయితే నన్ను ఏమనేవాడు కాదు కానీ మా పెద్దత్తమ్మ, ఆమె తల్లి అప్పుడప్పుడూ మాటలతో బాధించాలని చూసేవారు. వాళ్ళ మాటలను, వాళ్ళ ప్రవర్తనను నేను పెద్దగా పట్టించుకునేవాణ్ణి కాదు. పిల్లల్లో ఉండే నేచురల్ ఇన్‌స్టింక్ట్ ద్వారా నాకు తెలిసిపోయేది వాళ్ళకు నేనంటే పెద్దగా యిష్టం లేదని, నా ముందున్న అట్రాక్షన్స్‌తో కంపేర్ చేసుకుంటే వాళ్ళ ప్రవర్తన నెగ్లిజబుల్‌గా అన్పించేది.

★★★

ఎట్లాగయితే నేం రెండు రోజుల తర్వాత మా అమ్మ, నాన్న దగ్గరి నుండి పర్మిషన్ సంపాదించింది. అయితే ముందుగా నేను మాత్రం వెళ్ళాలి. దసరా పండగ తర్వాత అమ్మావాళ్ళు వొచ్చి జాయినవుతారు.

నేనొక్కణ్ణే వెళ్ళగలనా అన్న అనుమానం అమ్మా నాన్నల కొచ్చినా, నేనే ధైర్యం చెప్పడంతో ఓ శుభ ముహూర్తాన ప్రొద్దున ఆరింటికి బయల్దేరే బెజవాడ ప్యాసింజర్ రైలులో బయల్దేరాను.

నాకైతే ఆ రైలును నేనే నడుపుతున్నంత సంతోషంగా ఉంది. బొమ్మకల్లులో దిగి వాగులో నడుచుకుంటూ అవతలి గట్టుకు చేరి బస్సెక్కి సాయంత్రం అయ్యేసరికి జగ్గయ్యపేటకు చేరుకున్నాను. బస్టాండు నుండి గాంధీచౌక్ వరకు నడిచి, ముందు యింటి కెళ్ళాలా, కొట్లోకి వెళ్ళి మామయ్యను చూడాలా అని ఆలోచించి – మామయ్య దగ్గరకే వెళ్ళాను. అద్దాల కౌంటరు ముందు పరుపు మీద కూర్చున్న మామయ్య నన్ను చూడగానే గబుక్కున లేచి నన్ను ఎత్తుకున్నాడు.

ఏడో తరగతి చదువుతున్న నాకు సిగ్గేసింది.

''ఏంది మామయ్యా నేను చిన్న పిల్లగాణ్ణమకున్నావా? ఎత్తుకున్నవ్?'' అని గారాబంగా అడుగుతూ మామయ్య చేతుల్లోంచి కిందకు జారాను.

''అబ్బో పేద్ద మొగోడివి లేరా!'' అంటూ బుగ్గల మీద ముద్దు పెట్టుకుని

''ఏంట్రా యింకా యింటి కెళ్ళలేదా?'' అని ప్రశ్నించాడు నా చేతిలోని సంచిని చూసి.

''లేదు మామయ్యా! నిన్ను చూద్దామని...'' అంటూ నసిగాను.

కౌంటర్లన్నింటికి తాళం వేసి కొట్టు కుర్రాడిని జాగ్రత్తగా చూస్తుండమని చెప్పి

''పద యింటి కెళ్దాం'' అంటూ నాతో పాటు నడిచాడు.

మామయ్య చేయి పట్టుకుని నడుస్తుంటే నాకు గర్వంగా అన్పించింది.

అత్తమ్మ నన్ను పలకరించింది. ''అమ్మా, పిల్లలు రాలేదే''మని ఆరా తీసింది.

నేను కాళ్ళు చేతులు కడుక్కుని వొచ్చే సరికి.

''వాడికి స్వీటు, ఫలహారం పెట్టమని 'అత్తమ్మను పురమాయిస్తున్నాడు మామయ్య.

మామయ్య ప్రక్కనే కూర్చుని అవన్నీ శుభ్రంగా తిన్నాను.

''కొట్టు మూసొద్దాం పదరా'' అంటూ మామయ్య బయటికి నడిచాడు.

కొట్టు మూసేసి, బట్టల కొట్లోకి వెళ్ళాము. మా అందరికీ దసరా పండుగకు బట్టలు పెట్టడం మామయ్యకు ఆనవాయితీ.

ఏడో తరగతిలోకి వొచ్చినప్పటి నుండీ నాకో కోరిక ఉండేది. ఫుల్‌పాయింట్, ఫుల్ షర్ట్ తొడుక్కుని ఇన్‌షర్ట్ వేసుకుని బెల్టు పెట్టుకోవాలనే నా కోరికను అనవసరంగా గుడ్డ దండుగని నాన్న ఒప్పుకోలేదు. ఆ కోరిక ఎక్కడ ఎలా తీర్చుకోవాలో తెలుసు కాబట్టి మామయ్య బట్టలు తీసుకుంటుంటే నేను గొణగడం మొదలు పెట్టాను.

''ఏంట్రా?'' అన్నాడు మామయ్య.

నేను నలభై మెలికలు తిరిగాను.

''చెప్పరా కన్నా'' అంటూ బుజ్జగించాడు.

''మామయ్యా నాకు ఫుల్ పాంటు, ఫుల్‌షర్ట్ కావాలి'' అని గొణిగాను.

''ఓర్నీ దీనికేనారా అన్ని అపసోపాలు పడుతున్నావు'' అంటూ నా కోరిక ప్రకారమే టెర్లిన్ గుడ్డలు తీసుకుని టైలర్ కిచ్చాడు. వాడు నా చేతుల, కాళ్ళ చివరి వరకు కొలతలు తీసుకుంటుంటే నా ఛాతీ గర్వంతో ఉప్పొంగింది.

ఇంటికొచ్చేసరికి డాక్టర్ గారు హాల్లో కూర్చుని అత్తమ్మ, వాళ్ళమ్మతో ముచ్చట్లు పెడుతూ కన్పించారు. మామయ్యతో పాటు వొచ్చిన నన్ను చూసి '' ఏమయ్యా ఎప్పుడొచ్చా?'' అంటూ ప్రశ్నించాడు.

''ఇప్పుడే'' అంటూ ఉయ్యాల బల్లమీద కూర్చుని, దారిలో మామయ్య కొనిచ్చిన ''చందమామ'' ట్యూబ్‌లైట్ వెలుతురులో చదవడం మొదలు పెట్టాను.

డాక్టర్ వీరభద్ర రావు ఆర్.యం.పి. అప్పట్లో జగ్గయ్యపేటలో ఆయనదే పెద్ద ప్రాక్టీసు. ప్రతీ రోజూ మామయ్య వాళ్ళింటికొచ్చి చెక్ చేసేవాడు. అదో లగ్జరీ.

★★★

మర్నాడు టిఫిన్‌ల కార్యక్రమం కాగానే మామయ్యతో పాటే కొట్టు తెరిచి కాసేపు కూర్చున్న తర్వాత ఆ సెలవుల్లో నా ఎజెండా – సైకిల్ నేర్చుకోవడం, మామయ్యతో పాటు బెజవాడ వెళ్ళి దీపావళి బాంబులు కొనడం, ఎట్లాగైనా సరే పండక్కి నా కొత్త పాంటుకి బెల్టు, బాటా సాండిల్స్ కొనడం వంటి నా ప్లాన్లు అన్నీ మామయ్యకు వివరించాను.

మామయ్య నవ్వుతూ, ''పెద్ద లిస్టేరోయ్'' అంటూ ఓకే చేసాడు.

ముందు అద్దె సైకిల్ తెమ్మని కొట్టు కుర్రాణ్ణి పంపాడు. వాడితో పాటు నేనూ వెళ్తానని మారాం చేస్తే ఎండలో అంత దూరం వొద్దని, ప్రక్కనే ఉన్న మిఠాయి కొట్లో తొక్కుడు లడ్డు కొనుక్కొమ్మని డబ్బులిచ్చాడు. మామయ్యకు నా వీకనెస్ తెలుసు. ''తొక్కుడు లడ్డు'' పేరు చెప్పగానే నేను వెంటనే పడిపోతాను. అందుకే అప్పుడప్పుడు ''తొక్కుడు లడ్డు'' అని ఏడ్పించేవాడు కూడా.

తొక్కుడు లడ్డును ఆప్యాయంగా నాకుతూ, కొసరి కొసరి తింటూ అద్దె సైకిల్ కోసం ఎదురు చూస్తూ గడిపాను.

అద్దె సైకిల్ రావడం ఆలశ్యం, కొట్టు కుర్రాడు చూపించినట్లుగా రాడ్ కింద నుంచి కాళ్ళు పెట్టి ''కైంచి'' తొక్కడం ప్రారంభించాను. రెండు మూడు సార్లు కిందపడి మోకాళ్ళ చిప్పలు పగిలి రక్తం కారుతున్నా సైకిల్ తొక్కడం మానలేదు. వినాయకుడి గుడి చుట్టూ ఓ వంద చక్కర్లైనా కొట్టి ఉంటాను. అలా మధ్యాహ్నం భోజనం సమయం వరకు తొక్కుతూనే ఉన్నాను. మామయ్యొచ్చి, నల్లగా కమిలిపోయిన నా ముఖాన్ని, రక్తం కారుతున్న మోకాలి చిప్పలను చూసి, కేకలేసి, సైకిల్ వాపస్ యివ్వమని చెప్పి, నన్ను యింటికి తీసుకెళ్ళాడు.

యింట్లోకి నడుస్తుంటే కాలు నేల మీద మోపలేక పోయాను. ''అమ్మా'' అని కింద కూలబడిపోయాను.

కింద కూలబడిన నన్ను చూసి మామయ్య కంగారుపడి ''ఏంట్రా?'' అంటే మండుతున్న పాదాలు చూపించాను.

అరికాళ్ళ నిండా పొక్కులు. అవి చితికిపోయి రక్తాలు కారుతున్నాయి.

మామయ్య నన్ను ఎత్తుకుని కుర్చీలో కూర్చో పెట్టాడు.

"ఒక్కరోజే అంతలా సైకిల్ తొక్కుతావా వెధవ. చెప్పులు లేకుండా తొక్కావా. చూడు కాళ్ళెలా తయారయ్యాయో" అంటూ తిట్టాడు.

డాక్టరును పిలిపించి ఆయింట్‌మెంటు రాసాక గానీ మంట తగ్గలేదు.

రెండు రోజుల తర్వాత గానీ కాలు కింద ఆనించలేకపోయాను. కాలు కింద ఆనించేసరికి కొత్త బాటా సాండిల్స్ తగిలాయి. నా కళ్ళు మెరిసాయి. మూడో రోజు మళ్ళీ సైకిల్ ప్రాక్టీసు మొదలు పెట్టాను. కానీ రోజుకో గంట మాత్రమే. "ఎందుకంటే సాండిల్స్ పాడైపోతాయని" మామయ్య చెప్పాడు. నేనూ నమ్మాను.

ఆ దసరా సెలవులయిపోయేసరికి సైకిల్ తొక్కడం – మడత సైకిల్, సీటు మీద కూర్చుని తొక్కడం కూడా వొచ్చేసింది.

★★★

నవరాత్రి సందర్భంగా వినాయకుడి గుడిలో ప్రతీరోజూ సాయంత్రం పూజలు జరిగేవి. రంగు రంగుల దీపాల వెలుతురులో జరిపే పూజలు చాలా బాగా అన్పించేవి. రాత్రి పూట హారతి, అర్చన మామయ్య పేరు మీదే జరిగేవి. ఆ తర్వాత రోజుకో రకం ప్రసాదం పెట్టేవాళ్ళు. అందుకే సాయంత్రాలన్నీ అక్కడే గడిచేవి నాకు.

నాతో పాటు కొట్టు కుర్రాడు కూడా వొచ్చేవాడు.

వాడి దగ్గరో గమ్మత్తయిన విద్య ఉంది. నోట్లో నాలుక మడతపెట్టి ఒక్కసారి నాలుకను పళ్ళతో గట్టిగా నొక్కితే నాలుక కింది భాగం నుండి నీళ్ళు ఓ చిన్న ధారలా చిమ్మేవి. అదెట్లా వొస్తుందో నేర్పమని వాణ్ణి ఎంతగానో బతిమిలాడాను. వాడూ ఎంతో ట్రై చేసాడు నాకు నేర్పడానికి. కానీ నా కలా ఫౌంటెన్‌లా నీళ్లు వొచ్చేవి కాదు. గుళ్ళో గుంపులో నిలబడ్డప్పుడు, వాడు అమాయకంగా ముఖం పెట్టి నాలుకను ప్రయోగించేవాడు. గుంపులో ఎవరో ఒకరిమీద నీళ్ళు చిమ్మేవి. వాళ్ళు ఉలిక్కిపడి తుడుచుకునే వాళ్ళు. మేము పొట్ట చెక్కలయ్యేటట్టు నవ్వుకునే వాళ్ళం.

చాలా సార్లు అలా నీళ్ళు మీద పడ్డ వాళ్ళు, పూజారి గారు తీర్థం చల్లారని అనుకునేవాళ్ళు.

★★★

దసరా పండగ తర్వాత ఓ రోజు పొద్దున్నే మామయ్యతో కలిసి బెజవాడకు బయల్దేరాం దీపావళి మతాబులు కొందామని. "నువ్వెందు కయ్యా! మామయ్య గారు కొనుక్కొస్తారులే" అని అత్తమ్మ వాళ్ళమ్మ కొంచెం డిస్కరేజ్ చేయాలని చూసినా

"పోనీ లెండి అత్తయ్యా! పిల్లాడు కదా ఉబలాటపడుతున్నాడు" అంటూ బయల్దేరదీసాడు.

బెజవాడలో మామయ్య కొట్టు పని అయ్యాక సామారంగం చౌక్‌లోని ఓ కొట్లో దీపావళి టపాసులు కొన్నాం.

మామయ్య వొద్దంటున్నా వినకుండా బాంబులు కొన్నాను, మొదటిసారిగా. అవి ఆ కొట్లోనే ఉంచి మ్యాట్నీ సినిమా చూసి వొచ్చిన తర్వాత తీసుకుని జగ్గయ్యపేటకు బయల్దేరాం.

దారి పొడుగూతా టపాసుల బుట్టను నేను పట్టుకున్నాను. వాటి వాసనను ఊపిరితిత్తుల నిండా పీల్చాను. బాంబుల వాసనతో నా మనసు పులకరించింది.

ఆ రాత్రి – పెద్ద పెద్ద బాంబులు పేలుస్తున్నట్లు, ఆ చప్పుళ్ళతో చెవులు దద్దరిల్లి పోతున్నట్టు, ఆ వాసనలను పీలుస్తున్నట్లు – నిద్రలో కలలన్నీ బాంబుల చుట్టే.

మా పెద్ద మామయ్య వాళ్ళింట్లో ఓ స్టోర్ రూం ఉండేది. తెచ్చిన దీపావళి టపాసులన్నీ రెండు మూడు చాటల్లో పోసి ఆ స్టోర్ రూంలో ఎండ పడేట్టుగా ఉంచేవారు. అవి కొనుక్కొచ్చిన రోజు నుండి రోజూ రెండు మూడు సార్లు నేను స్టోర్ రూంకు వెళ్ళి టపాసులను చూసుకొచ్చుకునే వాణ్ణి.

నా ఆత్రం చూసి అందరూ నవ్వుకునేవాళ్ళు.

జగ్గయ్యపేటలో అప్పట్లో ఓ ఆచారం ఉండేది. మొగాళ్ళంతా రెండు గ్రూపులుగా విడిపోయి జువ్వలను అంటించి ఒకరి మీదకు ఒకరు విసురుకునేవాళ్ళు. ప్రమాదం అంచునే అయినా ఆ ఆట థ్రిల్ కలిగించేది వాళ్ళకు. అందుకే జువ్వలను ముందుగానే కొని ఎండలో ఉంచేవారు. అప్పుడే అవి బాగా పువ్వులను వెదజల్లేవి.

ఆ టపాసులన్నీ ఎప్పుడెప్పుడు కాల్చేయాలా అని ఉవ్విళ్ళూరుతుండేవాడిని. ఆ ఐదారు రోజులు కలలన్నీ దీపావళి టపాసుల చుట్టే.

అనుకున్నట్టుగానే దీపావళి పండుగ రానే వొచ్చింది. పొద్దున్నే పూజలవీ అయిన తర్వాత ఎప్పుడెప్పుడు చీకటి పడుతుందా ఎప్పుడెప్పుడు బాంబులు కాల్చేయాలా అనే ఆరాటం నన్ను ఉర్రూతలూగిస్తోంది.

★★★

అలా జగ్గయ్యపేట, ఎన్నో నా "మొదటి..." అనుభవాలకు కార్యక్షేత్రం. సరదా దసరాలు, చీకటి వెలుగుల దీపావళి పండుగలు కొన్ని గడిచేసరికి ఎందుకో మనుషుల ప్రవర్తనలో మార్పులొచ్చాయి. జీవితాల్లో, బంధుత్వాల్లో ప్రాధాన్యతలు మారిపోయాయి.

ఆ తర్వాత పెద్ద మామయ్య దగ్గరి నుండి దసరా పండుగకు రమ్మని ఆహ్వానించే ఉత్తరాలే రాలేదు.

వొద్దని చెప్పడానికి గానీ, పొమ్మని పర్మిషన్ యివ్వడానికి గానీ నాన్న ఈ లోకంలోనే లేడు.

కాలం గడుస్తోంది.

కొంచెం వ్యంగ్యంగా మాట్లాడే అత్తమ్మ, వాళ్ళమ్మ; మా పెద్ద మామయ్య అంటే ప్రాణానికి ప్రాణంగా ప్రేమించే మా అమ్మా కాలగర్భంలో కలిసిపోయారు.

కాలం గడుస్తోంది.

మా పెద్ద మామయ్య గారాబాల మేనల్లుణ్ణయిన నేనూ పెద్దవాణ్ణయిపోయాను. పెళ్ళి, పిల్లలు, ఉద్యోగాలు, అనారోగ్యాలు, పిల్లల పెళ్ళిళ్ళు యిలా ఈతి బాధలతో సంసారాన్ని ఈదుతున్నాను.

ప్రతీ దసరా సెలవులకు జగ్గయ్యపేట వెళ్ళాలనే కోరికతో, సంవత్సరంలో మిగిలిన రోజులన్నీ ఆరాటంగా గడిపిన నేను, జగ్గయ్యపేటకు వెళ్ళి కనీసం పది పదిహేనేళ్ళయింది.

అయినా దసరా పండుగలు, దీపావళి పండుగలు వొస్తూనే ఉన్నాయి. గడిచి పోతూనే ఉన్నాయి.

మళ్ళీ దీపావళి పండుగ వొస్తుంది.

★★★

పెద్ద మామయ్యకు ఆరోగ్యం బాగోలేదని తెలిసింది.

బీ.పీ, షుగర్, వార్ధక్యంతో బాధపడుతున్నాడు.

అయినా దీపావళి పండుగ వొస్తుందంటే, పెద్ద మామయ్య దగ్గర నుంచి ఉత్తరం వొస్తుందేమోనని ఏదో చిన్న ఆశ మిణుక్కు మంటూనే ఉంటుంది. మొదటిసారి సైకిల్ నేర్చుకున్న విషయం; మొదటిసారిగా పొడుగు చేతుల చొక్కా, ఫుల్ పాయింట్ కుట్టించుకున్న వైనం, శరభయ్య హోటల్లో మామయ్య పేరు చెప్పి లాగేసిన సాంబారు యిడ్లీల ఉదంతం అన్నీ మదిలో తిరుగుతుంటాయి 'జగ్గయ్యపేట' పేరు వినగానే. ఉత్సాహంగా అన్పిస్తుంది. దీపావళి మతాబుల విషయం గుర్తుకొస్తేనే... బాధగా ఉంటుంది. ప్రతీ దీపావళి చలి కాలంలోనే వొస్తుంది. చలి కాలం నాకు ఆస్మా ఎక్కువవుతుంది. చలి కాలం అంతా మందులతోనే గడపాలి. ఇప్పుడు దీపావళి మతాబులు కాలిస్తే వొచ్చే పొగతో నేను ఉక్కిరిబిక్కిరవుతాను. ఆ పొగ నాకు పడదు. ఒకప్పుడు ఊపిరితిత్తుల నిండా పీల్చిన ఆ వాసనే ఇప్పుడు నేను పీల్చితే – నీళ్ళల్లోంచి బయట పడిన చేపలా – ఆక్సిజన్ అందక ఉక్కిరి బిక్కిరవుతాను.

ఆ బాంబుల మోత నా గుండెల్లో నగారా మోగించినట్లుగా భయపెడ్తుంది. దీపావళి పండుగ ముందురోజు నాకు ఆస్మా తిరగబెట్టింది. ఆ రాత్రి హాస్పిటల్లో చేరాను.

"నాన్న ఆస్మా పేషెంట్. గుండె కూడా వీక్‌గా ఉంది. ఫుడ్ విషయంలో చాలా సెన్సిటివ్ చల్లటి వస్తువులు ముఖ్యంగా మార్కెట్లో కొన్న స్వీట్లు అస్సలే పడవు. కొకర్స్ స్మెల్ కూడా పడదు కాబట్టి టేక్ కేర్" అని డాక్టర్ మా వాడికి చెబ్తుంటే, వాడు తలూపుతున్నాడు.

దీపావళి పండుగ నాటి సాయంత్రం వేళ నన్ను దాదాపు ఏ.సీ. రూంలో బంధించి పడేసారు.

అయినా బాంబుల పేలుళ్ళ చప్పుళ్ళు అప్పుడప్పుడు విన్పిస్తూనే ఉన్నాయి. బంధుత్వాల్లాగా, దీపావళి మతాబులు కూడా నాకు దూరమయ్యాయి. నేను జగ్గయ్యపేటలో బాంబులు పేలుస్తున్న దృశ్యాలను, మరోసారి, ఊహించుకుంటూ ఉండిపోయాను.

★